సాక్షి నంద్యాల

1

గురువారం, 2, అక్టోబర్, 2025



న్యూస్‌రీల్

10లోపు ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించండి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ విద్యార్థులు పరీక్షల ఫీజును ఈనెల 10వ తేదిలోపు చెల్లించాలని డీఐఈఓ శంకర్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు థియరీ పరీక్షల కోసం రూ.600, జనరల్ కోర్సులు చదువుతున్న ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు రూ.600తో పాటు ప్రాక్టికల్స్‌కు రూ.275, అలాగే ఒకేషనల్ కోర్సులు చదవుతున్న వారు రూ.165 అదనంగా చెల్లించాలన్నారు. గడువు దాటితే రూ. 1000 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులు గడువులోపు ఫీజు చెల్లించేలా చూడాలని సూచించారు.

3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 3న స్థానిక మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి-శిశు సంక్షేమం, పనులు-ఆర్థిక ప్రణాళిక శాఖలపై సమీక్ష కొనసాగుతుందన్నారు. ఆయా స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించే సమయానికి అనుగుణంగా చైర్‌పర్సన్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు హాజరు కావాలని సీఈఓ కోరారు.

నిప్పులవాగుకు నీటి విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 824 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల నీరు వదిలారన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,039 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఇందులో నిప్పులవాగుకు 824క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 195 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 20 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డిపై దాడి

బనగానపల్లె రూరల్: పట్టణంలో నివాసం ఉండే ఎర్రగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డిపై కొందరు గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. సొంత పని నిమిత్తం రామసుబ్బారెడ్డి సాయంత్రం 6.30 గంటల సమయంలో యనకండ్ల గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. యనకండ్ల, బత్తులూరుపాడు గ్రామాల మధ్యలో నలుగురు గుర్తు తెలియని దుండగులు రెండు మోటర్ సైకిళ్లతో వెంబడిస్తూ రామసుబ్బారెడ్డిపై రాళ్లతో దాడి చేశారు. భయందోళనకు గురైన అతను బైక్‌ను వేగంగా నడుపుకుంటూ బత్తులూరుపాడులోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రామ్మోహన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి దాడి విషయాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఫోన్ చేసి తెలియజేశారు. వెంటనే ఆయన వాహనాన్ని పంపి చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. దాడి ఘటనపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రామసుబ్బారెడ్డి తెలిపారు.



కొండంత సంబరం.. నవరాత్రి వైభవం



శ్రీశైలంలో దేదీప్యమానంగా దసరా మహోత్సవాలు

- రమావాణీసేవిత రాజరాజేశ్వరిగా భ్రమరాంబాదేవి
- అశ్వ వాహనంపై విహరించిన భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పణ
- నేటితో ముగియనున్న దసరా మహోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు దేదీప్యమానంగా సాగుతున్నాయి. బుధవారం రాజరాజేశ్వరి స్వరూపంలో భ్రమరాంబాదేవి, అశ్వవాహనంపై భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు విహరించి భక్తులను ఆశీర్వదించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీశైల భ్రమరాంబాదేవిని రమావాణీసేవిత రాజరాజేశ్వరిగా అలంకరించారు. అమ్మవారి ఆలయం ముందుభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వేదికపై రాజరాజేశ్వరి అమ్మవారిని ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా, హారతులిచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను అశ్వ వాహన సేవలో అలంకరించారు. ఆలయంలోని అలంకార మండపంలో ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మవారిని, అశ్వ వాహనంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. కోలాటాలు, తప్పెట్లు, కర్ణాటక డ్రమ్స్, మేళాతాళాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల విచిత్ర వేషధారణలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

దసరా మహోత్సవాల్లో భాగంగా గురు వారం భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో, నంది వాహనంపై భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. నేటితో దసరా మహోత్సవాలు ముగియనున్నాయి.


ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు




కళాకారుల నృత్య ప్రదర్శన



రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావులు పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు.


స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి, తదితరులు

ఒకటో తేదీ..జీతం ఏదీ?

- ఉమ్మడి జిల్లాలో ఒక్క ఉద్యోగికి కూడా చెల్లించని కూటమి సర్కారు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెట్టడం మరిచారు. సాధారణ సమయాల్లో ఏమో కనీసం పండుగ సమయంలో కూడా అందని పరిస్థితి. దసరా హిందువులకు అతి పెద్ద పండగ. అయితే ఉద్యోగులకు ఈ పండుగ సంతోషం లేకుండా పోయింది. ఒకటోతేది వచ్చినా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎవ్వరికీ వేతనాలు అందలేదు. దసరా పండుగ నేపథ్యంలో సెప్టెంబరు నెల వేతనాలను 29, 30వ తేదీల్లోనే సర్కారు చెల్లిస్తుందని ఉద్యోగులు ఆశించారు. 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు కూడా అకౌంట్లలో వేతనాలు జమ కాకపోవడంతో నిరాశకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు కనీసం ఒక డీఏ కూడా ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త టీచర్లకు శిక్షణ తర్వాతే పోస్టింగ్

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో ఇటీవల 2,805 మంది టీచర్ నియామక పత్రాలు అందుకున్నారు. వీరందరికి ముందు ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చి ఆ తరువాతే పోస్టింగ్‌లు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ట్రైనింగ్‌ను రేపటి (శుక్రవారం)నుంచి ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఈ నెల 10వ తేది తరువాత పోస్టింగ్ ఇస్తారు. ఒక వేళ ఎవరైనా ఈ ట్రైనింగ్‌కు హాజరుకాకపోతే వారికి ఓ నెల తరువాత ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు కమిషనర్ వెబెక్స్‌లో తెలిపారు. కాగా ఇండక్షన్ ట్రైనింగ్‌కు జిల్లాలో 10 కేంద్రాలను ఎంపిక చేశారు. ఇందులో రాయలసీమ వర్సిటీ పరిధిలోని కొన్ని బీఈడీ కాలేజీలున్నాయి. వీటిలో టీచర్లకు ట్రైనింగ్ ఇస్తే బీఈడీ విద్యార్థులకు తరగతులు ఎక్కడ నిర్వహిస్తారో తెలియని పరిస్థితి.

జిల్లాకు రాష్ట్ర స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర అవార్డ్స్- 2025'లో నంద్యాల జిల్లాకు ఒక రాష్ట్రస్థాయి, 51 జిల్లాస్థాయి అవార్డులు లభించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమం కింద రాష్ట్రంలో తొలిసారిగా సమగ్ర పరిశుభ్రతా సర్వే నిర్వహించి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజా ప్రదేశాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) వంటి స్థిరమైన ఆచరణల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు కేటాయించారన్నారు. ఇందులో జిల్లా నుంచి 'మన ఊరు - మన గుడి - మన బాధ్యత' స్వచ్ఛంద సంస్థ రాష్ట్రస్థాయి అవార్డు పొందగా, జిల్లాస్థాయిలో 51 అవార్డులు లభించాయని తెలిపారు. స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామపంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు వంటి విభాగాలకు అవార్డులు ప్రకటించారన్నారు. ఈనెల 6వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో అవార్డు విజేతలను సన్మానించనున్నట్లు వెల్లడించారు. జిల్లాకు సంబంధించిన రాష్ట్రస్థాయి విజేతలు, జిల్లా స్థాయి అవార్డు విజేతల పూర్తి వివరాలు ప్రజలు పోర్టల్(https://sasa.ap.gov.in/) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

HOTEL K FORTUNE
EXPERIENCE THE LUXURY
విజయదశమి శుభాకాంక్షలు
ROOMS - SUITES - BANQUETS - RESTAURANT
వివ DIVA
NEAR G PULLAREDDY ENGINEERING COLLEGE, NANDYAL ROAD, KURNOOL, 518007.
08518-227222, 78 42 43 44 08

పింఛన్ల పంపిణీ.. తప్పని అవస్థలు

- ఇంటి దగ్గర అందజేత నామమాత్రమే
- అవ్వాతాతలకు తీరని ఎదురుచూపులు


ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ చేయకపోవడంతో బనగానపల్లె పట్టణంలోని సచివాలయానికి చేరుకున్న లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల (న్యూటౌన్): కూటమి ప్రభుత్వ పాలనలో ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ చెప్పుకోవడానికే పరిమితమైంది. ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా అవ్వతాతలు, వికలాంగులు ఇతర పింఛన్‌దారులు గ్రామ, వార్డు సచివాలయాల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. పనులు వదులుకొని చాలామంది పింఛన్‌దారులు సచివాలయాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాశారు. అక్టోబరు నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. పలు మండలాల్లో పింఛన్‌దారులందరికీ ఒకే చోటుకు పిలిపించి పంపిణీ చేశారు. దీని వల్ల అవ్వాతాతలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డితో కలసి కర్నూలు నగరంలోని వివిధ కాలనీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పింఛన్లు పంపిణీ చేశారు.

కర్నూలులో 94.12 శాతం, నంద్యాల జిల్లాలో 94.43 శాతం పంపిణీ...

అక్టోబరు నెలకు సంబంధించి కర్నూలు జిల్లాలో 2,38,755 పింఛన్లు ఉండగా...సాయంత్రం 6 గంటల సమయానికి 2,24,711 (94.12 శాతం) మందికి పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,15,005 పింఛన్లు ఉండగా 2,03,032 (94.43 శాతం) పంపిణీ చేశారు. ఇంకా తీసుకోని వారికి ఈ నెల 3వ తేదీన పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైల దేవస్థానానికి ఐఎస్ఓ గుర్తింపు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి పలు విభాగాల్లో ఐఎస్ఓ గుర్తింపు లభించినట్లు మంత్రి అనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం అందుకు సంబంధించిన సర్టిఫికెట్లను ఆ సంస్థ ప్రతినిధులు అందించారు. ఐఎస్‌వో 90001- క్వాలిటీ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికేషన్, ఐఎస్ఓ 140001-ఎన్విరాల్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌వో 22000-ఫుడ్‌సేఫ్టీ సర్టిఫికేషన్, గుడ్ గవర్నెర్స్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించినట్లు మంత్రి తెలిపారు.

మా సమస్యలు పరిష్కరించాల్సిందే

- డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన


నంద్యాలలో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

గోస్పాడు: న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాల్సిందేనని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో వైద్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటి వరకు పరిష్కారం లేదన్నారు. 20 ఏళ్లుగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నా తమకు పదోన్నతులు రావడం లేదని, సీనియర్లు, జూనియర్లు ఒకే కేడర్‌లో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనికోరారు. అలాగే వైద్యులకు కచ్చితమైన పనిగంటలు ఏర్పాటు చేయాలని, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలని, వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలని, అనధికార వ్యక్తులు(నాన్ మెడికల్, శాఖకు సంబంధం లేనివారు) పీహెచ్‌సీలను విచ్చలవిడిగా తనిఖీ చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. అలాగే గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న చంద్రన్న సంచార చికిత్స అలవెన్స్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు కాంతారావు నాయక్, భరత్ కుమార్, ప్రణీత్, షబ్బీర్, హుసేని, ప్రసన్న లక్ష్మి, రూపేంద్రనాథరెడ్డి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

KEERTHI SOLAR POWER AGENCIES
ప్రధానమంత్రి సూర్యఘర్
TATA POWER SOLAROOF
TATA
INDIA'S No.1* SOLAR ROOFTOP COMPANY
WHAT IF YOUR HOME NEVER HAD AN ELECTRICITY BILL AGAIN?
SBI
దసరా & దీపావళి పండుగ సందర్భంగా '0' డౌన్ పేమెంట్‌తో ఇంటిపై సోలార్ నిర్మించుకోవచ్చు.
Our Products:
Solar Power Fencing · Solar Water Heaters · Solar Agriculture Pumpsets · Solar Off-grid · Solar Hybrid · Solar Batteries · Solar Lights
OUR SERVICERS: System Design, Installation and Services and Maintenance Services
Switch to Solar. Power your Life.
100% ఫైనాన్స్
అనుభవజ్ఞుల సేవా బృందం
48 గంటల కంటే తక్కువ సమయంలో ప్రోసెసింగ్
FOR YOUR HOME, OFFICE, SCHOOL, PETROL PUMPS, HOSPITALS
Authorized Channal Partners
Head Office : Vegetable Market Godown No.4, Near RTC Bus-Stand, KURNOOL, A.P.Cell: 81062 20228, 81062 23228, 94401 55473, Nandyal : 9398785552.

సంప్రదాయ సమరానికి 'సై'


మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

విజయ దశమి రోజున అర్ధరాత్రి సాగనున్న సంప్రదాయ సమరానికి దేవరగట్టు సర్వం సిద్ధమైంది. స్వామి అమ్మవార్ల జైత్రయాత్ర సందర్భంగా బన్ని ఉత్సవం పేరుతో జరిగే కర్రల సమరాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలమూలల నుంచే గాక పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు వెయ్యి మందితో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

– హొళగుంద

- దేవరగట్టులో విజయదశమి రోజున మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవం
- కలాణోత్సవంతో మొదలుకానున్న 'జైత్రయాత్ర'
- వెయ్యి మందితో పోలీసు బందోబస్తు


దేవరగట్టు

హొళగుంద మండలం నెరణికి గ్రామ సమీపంలోని దేవరగట్టుపై వెలసిన మాత మాళమ్మ, మల్లేశ్వర స్వామి అమ్మవార్ల ఉత్సవాలు విజయదశమి రోజున వైభవంగా జరుగుతాయి. అదే రోజు అర్ధరాత్రి నిర్వహించే స్వామి అమ్మవార్ల కల్యాణం తర్వాత జరిగే బన్ని ఉత్సవంలో ఘర్షణలకు తావులేకుండా కలిసి కట్టుగా జరుపుకుందామని దేవరగట్టు సమీపంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు చెరువుకట్ట (డొళ్లిన బండే)వద్దకు చేరి పాలబాసలు తీసుకుంటారు.


దేవరగట్టుపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయం

అనంతరం కల్యాణానికి వస్తున్నట్లు గ్రామపెద్దలు పోలీసులకు బండారాన్ని ఇస్తారు. జౌట్‌లు పేల్చి ఇనుప తొడుగులు, రింగు కర్రలు, అగ్గి కాగడాలు చేతపట్టి డోలు, మేళతాళాలతో నిమిషాల్లో కొండ(గిరి)పైకి చేరుకుంటారు. అక్కడ మాత మాళమ్మ, మల్లేశ్వర ఉత్సవ విగ్రహాలకు పురోహితులు, వేద పండితులు కల్యాణం జరిపిస్తారు. అనంతరం అర్ధ రాత్రి ఉత్సవ మూర్తులతో జైత్రయాత్ర ప్రారంభమవుతుంది. నిత్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెర తండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు మొగలాయిలో పాల్గొంటారు. ఈక్రమంలో భక్తుల చేతుల్లో ఉన్న కర్రలు తగిలి పలువురికి గాయాలవుతాయి. మాళ మాళమ్మ, మల్లేశ్వరుని విగ్రహాలను మల్లప్ప గుడిలో కొద్ది సేపు కొలువుంచి తిరిగి ఉత్సవ విగ్రహాలను పల్లకీతో ఊరేగింపుగా జైత్రయాత్రను కొనసాగిస్తారు.

భవిష్యవాణిపై నమ్మకం

శమీ వృక్షం నుంచి విగ్రహాలు బసవన్న గుడికి చేరుకోవడంతో ఆలయ పూజారి గిరిస్వామి భక్తులకు భవిష్యవాణి వినిపిస్తారు. ఆ సమయంలో అందరూ ఒక్కసారిగా మొగలాయిని నిలిపేసి నిశ్శబ్దాన్ని పాటిస్తారు. రాబోయే కాలంలో వాణిజ్య పంటల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయాలు తదితర పరిస్థితులను పూజారి వివరిస్తారు. అనంతరం పూజారి బహుపరాక్... గోపరాక్ అనగానే విగ్రహాలు సింహాసన కట్ట వైపు ఊరేగింపుగా బయలుదేరుతాయి. విగ్రహాలు సింహాసన కట్టకు చేరుకోవడంతో జైత్రయాత్ర ముగుస్తుంది.

జంతువుల నుంచి రక్షణకే..

పురాతన కాలంలో దసరా బన్ని ఉత్సవాలు జరుపుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు దేవరగట్టు మాళ మల్లేశ్వస్వామి కొండకు తరలి వచ్చే సమయానికి చీకటయ్యేది. అప్పట్లో విద్యుత్, రవాణా సదుపాయాలు లేకపోవడంతో విషపురుగులు, జంతువుల భారీ నుంచి రక్షణ పొందేందుకు దివిటీలు, మారణాయుధాలు చేత పట్టుకుని కొండ పైకి వెళ్లి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించేవారు. కొందరు వ్యక్తిగత కక్షలతో చీకట్లో జరిగే ఊరేగింపులో రింగుకర్రలు, దివిటీలు, మారణాయుధాలతో తమ ప్రత్యర్థులపై దాడులు చేసి పగ తీర్చుకునేవారు. ఇది కాలక్రమంలో కర్రల సమరంగా ముద్ర పడిపోయింది.

హెల్త్ క్యాంప్ ఏర్పాటు

ఉత్సవంలో గాయపడిన భక్తులకు దేవరగట్టులో భారీ ఎత్తున హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో 10 మంది డాక్టర్లు, ఆర్థోపెడిక్ సర్జన్, జనరల్ సర్జన్‌తో పాటు 100 మంది సిబ్బందితో వైద్య సేవలు అందించనున్నారు. వాటర్ ప్రూఫ్ టెంట్‌లో వందకు పైగా మంచాలు, మెడిసిన్, ఇతర అత్యవసర చికిత్సకు కావాల్సిన మందులు, పరికరాలతో పాటు 108, 104 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచనున్నారు.


ఆలయంలోని మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులు

రాక్షస గుండ్లకు రక్త సంతర్పణ

జైత్రయాత్రలో భాగంగా ఊరేగింపు రక్షపడికి చేరుకోగా, అక్కడ ఉన్న మణి, మల్లాసురా అనే రాక్షసులుగా భావిస్తున్న రెండు రాతి గుండ్లకు కంచాభీరా వంశానికి చెందిన గొరవయ్య బసవరాజు ఐదు చుక్కల రక్తాన్ని సమర్పిస్తాడు. కాలిపిక్కలో దబ్బణంతో ఒకవైపు నుంచి మరోవైపు లాగడంతో వచ్చే రక్తాన్ని రాతి గుండ్లకు విసురుతారు. గుండ్లకు అంటిన రక్తపు మరకలు ఉదయానికల్లా కనిపించవని, రాక్షసులు సేవిస్తారని భక్తుల నమ్మకం.

దేవరగట్టుకు చేరేది ఇలా..

కర్నూలు నుంచి ఆలూరు మీదుగా దేవరగట్టుకు చేరుకోవచ్చు. కర్నూలుకు దేవరగట్టు దాదాపు 120 కి.మీ దూరంలో ఉంది. ఆలూరుకు వచ్చి అక్కడి నుంచి అరికెర మీదుగా దేవరగట్టుకు 14 కి.మీ ప్రయాణం చేయాలి. కర్ణాటక నుంచి వచ్చే వారు హొళగుంద మీదుగా 22 కి.మీ దూరం ప్రయాణించాలి. ఇటు ఆంధ్రా, అటు కర్ణాటక నుంచి ఆలూరు, హొళగుంద వరకు బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలు, మోటార్ సైకిళ్లపై వెళ్లాల్సి ఉంటుంది. బన్ని రోజున ప్రైవేటు వాహనాలు అధికంగా తిరిగినా సాధారణ రోజుల్లో రవాణా సౌకర్యాలు ఉండవు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆలూరు నియోజకవర్గ ప్రజలకు దసరా శుభకాంక్షలు. ప్రతి ఒక్కరూ దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఆచారాలను, సంప్రదాయాలను గౌరవిస్తూనే పండుగను భక్తితో నిర్వహించుకుని, సంతోషంగా ఇంటికి చేరాలి. ఉత్సవాల్లో పాల్గొనే నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు దేవరగట్టు చుట్టు పక్కల గ్రామస్తులు బన్ని ఉత్సవం సమరం కాదు సంప్రదాయ పండుగని సమాజానికి చాటి చెబుదాం.

– బుసినే విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

క్లుప్తంగా

డ్రోన్ కెమెరాల నిఘాలో బన్ని ఉత్సవం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్


మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: దసరాను పురస్కరించుకుని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని డ్రోన్ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. బన్ని ఉత్సవాల్లో 10 డ్రోన్ కెమెరాలతో పాటు 110 సీసీ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో ఎవరైనా గాయాలపాలైతే వెంటనే వైద్యం అందించేందుకు 20 బెడ్లతో తాత్కాలిక ఆసుపత్రితో పాటు 104, 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 200 మంది ట్రబుల్ మాంగర్స్, సారా విక్రేతలను బైండోవర్ చేశామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా 340 రింగుల కర్రలు, నాటుసారాను సీజ్ చేశామన్నారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో ఐదు చెక్‌పోస్టులు, పది పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. బన్ని ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకో వాలని భక్తులకు ఎస్పీ సూచించారు.

తప్పిన ప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోనున్న విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర విద్యుత్ స్తంభాన్ని బుధవారం ఓ లారీ ఢీ కొట్టింది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. స్తంభం లేకుంటే నేరుగా లారీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి దూసుకెళ్లేదని ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు. మహారాష్ట్ర నుంచి చక్కెర లోడుతో ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీని ఒక కారు ఓవర్ టేక్ చేసి వెళ్లే క్రమంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో.. లారీ డ్రైవర్ కారును తప్పించే క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు డ్రైవర్, క్లీనర్ వెంటనే లారీ నుంచి కిందకు దూకేశారు. ప్రమాదంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఆస్పరి పోలీసులు తెలిపారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ రజతోత్సవాలు


కేక్ కట్ చేస్తున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.రమేష్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): భారత సంచార నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం కర్నూలు నగరంలో సంస్థ ఆధ్వర్యంలో రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ జి.రమేష మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ 2000 అక్టోబర్ 1న ప్రభుత్వ రంగ సెక్టార్ యూనిట్‌గా రూపుదిద్దుకున్నప్పటి నుంచి ప్రజలకు చేరువగా మారుమూల గ్రామాలకు కాపర్ ద్వారా ల్యాండ్‌లైన్, బ్రాండ్ బాండ్ సేవలను అందిస్తోందన్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పూర్తి ఫైబర్ టెక్నాలజీ ద్వారా వాయిస్, హై స్పీడ్ ఇంటర్‌నెట్ అందిస్తోందన్నారు. ప్రపంచంలోనే స్వదేశీ టెక్నాలజీని ఉపయోగిస్తున్న ఆరవ అతి పెద్ద సంస్థగా బీఎస్ఎన్ఎల్ రూపుదిద్దుకుందన్నారు. వినియోగదారులు తమ పాత సిమ్‌కార్డులను 4జీ సిమ్‌లుగా మార్చుకోవాలన్నారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా సరసమైన ధరలతో ప్రవేశపెట్టిన నూతన ప్లాన్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయినాథ్, ఏజీఎంలు వి.శ్రీను నాయక్, దేవచంద్ నాయక్, లక్ష్మనాయక్, మురళీకృష్ణ, నారాయణస్వామి, వి.జాన్సన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు అశ్వాల పారువేట

- కొనసాగుతున్న యాదవరాజ వంశీయుల సంప్రదాయం
- సైనికులుగా మద్ది కులస్తులు



రాచరికపు దుస్తుల్లో యాదవ రాజ వంశీయులు(ఫైల్), గుర్రాల పారువేట నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

మద్దికెర: రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి.. కానీ ఆనాటి సంప్రదాయాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. యాదవ రాజ వంశంలోని పెద్దనగిరి, చిన్ననగిరి, యామనగిరి కుటుంబీకులు అశ్వాల పారువేట ఉత్సవాన్ని మూడు శతాబ్దాల నుంచి కొనసాగిస్తున్నారు. ఏటా విజయ దశమి రోజున గుర్రాలపై స్వారీ చేయడం వీరి ఆచారం. అందులో భాగంగా గురువారం ఉత్సవాలు నిర్వహించడానికి సిద్ధం చేసుకున్నారు.

భోగేశ్వరాలయం నుంచి..

పూర్వం యాదవ వంశాలు రాజ్యాలను ఏలిన విజయం విదితమే. అందులో భాగంగా ఆయా యాదవ వంశీయుల కుటుంబాలు తమ పూర్వీకుల నుంచి వస్తున్న గుర్రపు స్వారీ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్కో కుటుంబం నుంచి రెండు, మూడు గుర్రాలను స్వారీకి అనుమతిస్తుండటంతో ఆయా కుటుంబాలు విజయదశమికి నెల రోజుల ముందు నుంచే గుర్రాలు సమకూర్చుకుని శిక్షణ ఇస్తారు. పండుగ రోజు వారు తలపాగ ధరించి రాచరికపు వస్త్రాలతో ఖడ్గాలు ధరించి గుర్రాలపై మేళ తాళాలతో మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలోని బొజ్జనాయినిపేట గ్రామంలో ఉన్న భోగేశ్వర ఆలయానికి చేరుకుంటారు. వీరికి సైనికులుగా 'మద్ది' కులస్తులు ఆయుధాలు ధరించి వెంట నడుస్తారు. ఆలయంలోని స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి మద్దికెరకు గుర్రాల స్వారీ ప్రారంభిస్తారు. విజయం సాధించిన వారిని భాజాభజంత్రీలతో మొదట ఊరేగిస్తారు. అనంతరం యాదవ రాజ వంశీకుల కుటుంబాలు గుర్రాలపై ప్రధాన రహదారిలో తమ రాచఠీవిని ప్రదర్శిస్తారు. ఈ వేడుకలను ప్రజలకు ఎంతో ఆశక్తితో తిలకిస్తారు.

తెలుగుగంగలో వ్యక్తి గల్లంతు


గల్లంతైన వెంకటేశ్వర రెడ్డి

బండి ఆత్మకూరు: తెలుగు గంగ ప్రధాన కాలువలో బుధవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లింగాపురం గ్రామానికి చెందిన భూమా వెంకటేశ్వర రెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలం పనులకు వెళ్లిన అనంతరం తాగునీటి కోసమని ఓంకారం సమీపంలోని తెలుగుంగా ప్రధాన కాలువ వద్దకు వెళ్లాడు. మెట్ల వద్ద దాహం తీర్చుకునే ప్రయత్నంలో కాలుజారి ప్రవాహంలో గల్లంతయ్యాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు


పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

అవుకు(కొలిమిగుండ్ల): బనగానపల్లె నుంచి అవుకు మండలం మంగంపేట తండాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం మార్గమధ్యంలో అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. బస్సులో 25 మందికి పైగానే ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ఏమీ కాక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దసరా పండుగ కావడంతో ప్రజలు నిత్యావసర సరుకులు,ఇతర వస్తువులను బనగానపల్లెలో తీసుకొని బస్సులో బయలుదేరారు. బస్సు కృష్ణగిరి మెట్ట మీదుగా మంగంపేటకు ప్రయాణించే సమయంలో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కకు ఒరిగింది.

సారూ కాళ్లు మొక్కుతా .. స్తంభాలు తొలగించండి

- తహసీల్దార్‌ను వేడుకున్న రైతు కుమారుడు


తహసీల్దార్ కాళ్లు పట్టుకున్న రైతు కుమారుడు

నందికొట్కూరు: సారూ తమ పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించండి అంటూ మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన రైతు నాగేశ్వరరావు కుమారుడు స్వామన్న తహసీల్దార్ శ్రీనివాసులు కాళ్లు మొక్కాడు. బుధవారం గ్రామ సభ జరుగుతుండగా స్వాములు తహసీల్దార్ వద్దకు వెళ్లి తమకు ఉన్నదే ఎకరా పొలమని, అందులో విద్యుత్ స్తంభాలు వేయడంతో సాగుకు కష్టంగా మారిందని, ఇదే విషయమై పదేళ్లుగా అధికారులకు విన్నవించుకుంటున్నా తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేయగా.. స్పందించిన తహసీల్దార్ విద్యుత్ అధికారులతో మాట్లాడి తొలగించేందుకు చర్యలు తీసుకుంటానని హామీచ్చారు.

రైతు కష్టం జీవాలపాలు!


ఇనగండ్ల సమీపంలో ఉల్లి పంటను మేస్తున్న గొర్రెలు

సి.బెళగల్: ఉల్లి రైతుల కష్టం అంతా ఇంతా కాదు. నాటు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన ఉల్లి పంట.. చేతికొచ్చిన తర్వాత ధర లేకపోవడంతో దిక్కుతోచక జీవాలకు వదిలేస్తున్నారు. మండలంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన రైతు ఇమ్మానియేలు ఎకరన్నర పొలంలో ఉల్లి సాగు చేశాడు. పంట చేతికి రావడంతో కోత కోయించేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో మార్కెట్లో ధర పూర్తిగా పడిపోయింది. మరోవైపు కోతకు కూలీ, గ్రేడింగ్, రవాణా ఖర్చులతో మరింత అప్పులపాలు కావాల్సి వస్తుందని ఆందోళన చెంది జీవాలకు వదిలేశాడు. తన రెక్కల కష్టం జీవాలకు మేతగా మారడం చూసి రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఉల్లి రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిమ్మకాయపై జగన్మాత!


నిమ్మకాయపై అమ్మవారి చిత్రాలు

నంద్యాల(అర్బన్): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ నిమ్మకాయపై అమ్మవారి చిత్రాలు వేసి అబ్బురపరిచారు. ఓ వైపు దుర్గాదేవి మహిషాసురిడిని వధించిన తర్వాత శాంతించి భక్తులను దీవిస్తున్నట్లు, రెండో వైపు జగన్మాత రూపాన్ని చిత్రించారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ అమ్మవారికి నిమ్మకాయల హారం ఎంతో ఇష్టమన్నారు. అందుకే భక్తులు అమ్మవారికి నిమ్మకాయల మాల వేస్తారన్నారు. దుష్ట శక్తులను దూరం చేసి రక్షణ ఇస్తుందని ప్రజల నమ్మకమన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి


శెట్టిమాన్ తిక్కస్వామి(ఫైల్)

పగిద్యాల: జమ్మూ కశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించే పగిద్యాల వాసి శెట్టిమాన్ తిక్కస్వామి(35) వారం రోజులుగా అనారోగ్యం బారినపడి ఢిల్లీ ఆర్ఆర్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆర్మీలో 14 ఏళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకుని ఇటీవల మళ్లీ 8 ఏళ్ల సర్వీస్‌ను పొడిగించుకుని ఢిల్లీలో పరేడ్‌కు హాజరై బీపీ లెవెల్స్ పడిపోయి అనారోగ్యానికి గురయ్యాడని వెల్లడించారు. మృతునికి భార్య సుభాషిణి, కుమారులు నిక్షిత్, షణ్ముఖ్ ఉన్నారు. గురువారం స్వగ్రామం పగిద్యాలలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

నిలిచిపోయిన రహదారి పనులు

- ఇబ్బందుల్లో 5 గ్రామాల ప్రజలు


నిలిచిపోయిన రహదారి పనులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామం నుంచి సీతారామాపురం, శంకరాపురం, బైనపల్లె మీదుగా యంబాయి, మండ్లవానిపల్లె గ్రామం వరకు చేపట్టిన పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ రహదారికి రూ.8.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న మేఘా సంస్థ వెంకటగిరి గ్రామం నుంచి సీతారామాపురం వరకు రహదారి పనులు పూర్తి చేసింది. అంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అప్పటి నుంచి శంకరాపురం, బైనపల్లె మీదుగా యంబాయి, మండ్లవానిపల్లె వరకు చేయాల్సిన పనులు కాంట్రాక్టర్ నిలిపేశారు. ఇప్పటికి ఏడాదిన్నర గడిచిపోయినా పనులు ప్రారంభించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన శంకరాపురం బ్రిడ్జి సైతం ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు స్పందించి మధ్యలో నిలిచిపోయిన పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.







సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

- A.P. ఓపెన్ స్కూల్ వారి 10th లేదా ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి మరియు డిగ్రీ, పిజి అడ్మిషన్స్ కొరకు సంప్రదించండి. సెల్ : 9394668667. [SCA25008538]
- రాయలసీమ స్కూలు, కర్నూలు APOSS 'ఓపెన్ ఇంటర్' MPC, Bi.Pc CEC & HEC {EM/TM} వన్ సిట్టింగ్ కోర్సులు కలవు. మార్చిలో పరీక్షలు. వివరాలకు సంప్ర: 9398252467. [SCA25008533]
- Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount Join M.Com/ MA Eng/MSW by 6/10, 3000 fee dis, 9177408565 [SCA25008618]

REAL ESTATE

PLOT FOR SALE

- RR రియల్ ఎస్టేట్ కర్నూలు – నంద్యాల రోడ్డు ఓర్వకల్లు హైవేకి హెచ్.కొట్టాల స్టేజీ ఎదురుగా గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో తక్కువ ధరలో ప్లాట్లు అమ్మకానికి కలవు. వివరాలకు సంప్రదించండి : 91828 21014. [SCA25008501]

LEASE / RENT

- కల్లూరు, జానకినగర్, పెట్రోల్ బంక్ వెనుక, 7.5 సెంట్లు, 6 పోర్షన్స్ కల్గిన, 2 అంతస్తుల బిల్డింగ్ సేల్/లీజుకు కలదు. గోపాల్: 99892 27997. [SCA25008617]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

